సాగునీటి చెరువు కప్పేసి... రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : సాగునీటి చెరువులను సంరక్షించి అభివృద్ధి చేయాలని, నీటి వనరుల అభివృద్ధి ద్వారా బీడు భూములను సాగులోకి తీసుకొని రావాలని ప్రతి రైతు కోరుకుంటాడు. కానీ సాగునీటి చెరువులను కప్పేసి రోడ్డు నిర్మాణం చేయడంతో పలు విమర్శలకు తావిస్తుంది. పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం ఎర్ర చెరువు కింద సుమారు 260 ఎకరాల ఆయకట్టు ఉంది. వంశధార 60 ఆర్ ఎల్ 5 ఎల్ బెండి కాలువ ద్వారా ఎర్ర చెరువులోకి సాగునీరు చేరుతుంది. అయితే చెరువు గర్భంలో ఎవరు కూడా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ప్రజోపయోగం కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా అటు రెవెన్యూ శాఖ, ఇటు వంశధార అధికారుల అనుమతులు తప్పనిసరి. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా చెరువు గర్భంలో రోడ్డు నిర్మాణం చేపట్టడం పలు విమర్శలకు తావిస్తుంది. చెరువులోకి నీరు వచ్చే కాలువ రోడ్డు నిర్మాణం వలన పూర్తిగా కుచించుకుపోయింది. చెరువులోకి సాగునీరు చేరడం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో సమీపంలోని ఇళ్లకు వరద పోటు ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గర్భంలో రోడ్డు నిర్మాణం వలన సాగునీటి సమస్యలు తలెత్తుతాయని రైతులు వాపోతున్నారు. అధికారులకు కనీస సమాచారం లేకుండా ఎవరి ప్రయోజనాలు కోసం చెరువు గర్భంలో రోడ్డు నిర్మాణం చేపట్టారో చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బి. అప్పలస్వామిని విలేకరులు వివరణ కోరగా చెరువు గర్భంలో రోడ్డు వేసిన విషయం స్థానిక విఆర్ఓ ద్వారా ఇప్పటికే ఫిర్యాదు అందింది అన్నారు. సాగునీటి చెరువులను అభివృద్ధి చేయాలి తప్ప కప్పేసే అధికారం ఎవరికీ లేదన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపిటీయఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమారావు

విశాలాంధ్ర-మందస : సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏ పీ టీ యఫ్ మందస నాయకులు కోరారు. శుక్రవారం మండలం లో సభ్యత్వ నమోదులో భాగంగా కొత్తపల్లి,ములిపాడు, సొండిపూడి, సిద్ధిగాం, హెూన్నాలి, సిరిపురం, పొత్తంగి, బెళ్ళపటియా,బుడార్సింగి, కృష్ణాపురం పాఠశాలలను సందర్శించి..ఆయా ఉపాధ్యాయులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా సీపీయస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, ఉపాధ్యాయులు జీతాల సమస్య వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ లో డి ఏ అరియర్లు విడుదల చేయాలని, కొత్త %ూ=జ% ని ప్రకటించి మధ్యంతరభృతిని అంతవరకు ప్రకటించాలని,ఐటీడీఏ పాఠశాల్లో వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని ఒక ప్రకటనలో కోరారు.ఈ కార్యక్రమంలో ఏ పి టీ యఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ.భీమారావు మరియు కార్యవర్గ సభ్యులు వి. వి.వరప్రసాద్, యస్ కిరణ్ కుమార్, డి. మోహన రావు, డి. వేణుగోపాల్, బి శివ,వసంత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

విశాలాంధ్ర-సోంపేట : కేన్సర్ వ్యాధితో భర్త చనిపోవడంతో ఆ కుటుంబానికి ఆమె పెద్దదిక్కై నిరంతరం శ్రమకోర్చి కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తున్న సందర్భంలో విధి వక్రించి తోటలో గోంగూర కోస్తుండగా కట్ల పాము కాటేసి ఓ మహిళ తన ప్రాణాలు విడిచింది. వివరాల్లోకి వెళితే సోంపేట మండలం మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం దున్న తులసమ్మ (40) అనే నిరుపేద మహిళ తనకున్న చిన్నపాటి స్థలంలో గోంగూర పండించి దాన్ని తరచుగా పరిసర గ్రామాలకు తీసుకువెళ్లి విక్రయించేది. శుక్రవారం కూడా గోంగూర విక్రయించేందుకు కోస్తుండగా కట్ల పాము కాటేసింది. విషయాన్ని గమనించని తులసమ్మ గోంగూరు తీసుకుని అక్కుపల్లి గ్రామంలో అమ్మేందుకు వెళ్లింది. అక్కుపల్లి జంక్షన్‌లో బస్సు దిగగానే కళ్లు తిరిగి కింద పడిపోవడంతో స్థానికులు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పలాసలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. అక్కడ వైద్యులు పాముకాటుగా గుర్తించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించాలని సూచించారు. శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలు తులసమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి మృతితో ఆ ఇద్దరు కుమార్తెలు అనాధలుగా మారారు. పదేళ్ల క్రితం మృతురాలి భర్త గిరిబాబు కేన్సర్ వ్యాధితో మృతి చెందాడు. స్థానికసర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాధవరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె బంధువులు మామిడిపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సోంపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆసుపత్రి ఆవరణలో విషాదం అలముకుంది. ఇద్దరు కుమార్తెలు వందన, ఝాన్సీ తల్లి మృతదేహంపై పడి గుండెలు పగిలేలా రోధించిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది.

భరోసానిచ్చే కార్డు ఈ-శ్రమ్

అసిస్టెంట్ లేబర్ ఇన్ స్పెక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-రణస్థలం : అసంఘటిత రంగంలో పనిచేసే వారికి భరోసానిచ్చే కార్డు ఈ శ్రమ్ కార్డు అని శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ లేబర్ ఇన్ స్పెక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండల కేంద్రంలో శుక్రవారం ఈ శ్రమ్ కార్డు లను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఉండదు. అలాంటి వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడానికి కేంద్ర ప్రభుత్వం 2021లో ఈ శ్రమ్ కార్డును తీసుకొచ్చిందని అన్నారు. దీన్ని లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని ఈ శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న వారికి రూ.2 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ. లక్ష ప్రమాద బీమా లభిస్తుంది. వీటితో పాటు ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాలు నేరుగా ఈ-శ్రమ్ ద్వారా అందజేస్తారన్నారు. దీనికి ఎవరు అర్హులు, ఇందులో ఎలా నమోదు చేసుకోవాలి అనే విషయాలు అసంఘటిత రంగంలో పనిచేసే వారు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు.

ఎవరు అర్హులు... అసంఘటిత రంగంలో పనిచేసేవారు 16-59 వయసు మధ్య ఉన్న వారందరు దీనికి అర్హులన్నారు. ఆధార్డు ఆధార్కార్డుతో లింక్ అయినా ఫోన్ నెంబర్ బ్యాంకు ఖాతా నెంబర్‌తో పాటు ఐఎఫ్ఎస్సీ కోడ్ డాక్యుమెంట్స్ కావాలన్నారు. దీనికోసం (హెచ్‌టీటీపీఎస్:// రిజిస్టర్.ఇశ్రమ్.జీవోవీ.ఇన్) వెబ్‌సైట్‌కి వెళ్లి మీ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ నమోదుచేసి మీ వ్యక్తిగత వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అలా చేశాక, ఈ-శ్రమ్ కార్డు జనరేట్ అవుతుంది. ఈ కార్యక్రమంలో లేబర్ కార్యాలయం సిబ్బంది, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

నీటమునిగిన పొలాలను డిప్యూటీ సీఎం కృష్ణదాస్ పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు : గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను, సాగునీటి వ్యవస్థలను వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదాల శాఖ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి వెంటనే నివేదించాలని ఆయన ఆదేశించారు. ఈయనతపాటు వైసీపీ నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

మణిపూర్ బాధితులకు ఓ దేశం ఇవ్వండి : ప్రముఖ రచయిత అట్టాడ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: భౌగోళికంగా, సాంస్కృతికంగా ఒక ప్రత్యేకత కలిగిన మణిపూర్లో తెగల మధ్య విద్వేషాలు సృష్టించడం వెనుక పాలకవర్గ పాత్ర బహిరంగమైందని, మత విద్వేషాన్ని రాజ్యమే రెచ్చగొడుతుందని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు విమర్శించారు. మణిపూర్ అందమైన అడవుల, పర్వతాల, లోయలతో విభిన్నమైన సంస్కృతి తెగలతో, వారి జీవన సౌందర్యంతో తొణికిసలాడుతుందని గుర్తు చేశారు. విలువైన ఖనిజ సంపద కోసమే, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పర్వత శిఖరాలపై నివసించే తెగలను వెళ్లగొట్టడానికి, లోయలు, మైదాన ప్రాంత తెగలవారిని రెచ్చగొడుతున్నారని చెప్పారు. అవమానాలు, అత్యాచారాలు, జీవన విధ్వంసకాండకు బలవుతున్న బలహీనులు మరో అడవికి వెళ్ళిపోలేరని, వారికి ఒక దేశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం వివిధ ప్రజా సంఘాలు, సాహిత్య, సాంస్కృతిక, మేధావి సంఘాలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల నిర్మూలన సమితి నాయకులు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ విజికే మూర్తి, దళిత సంఘ నాయకులు కల్లేపల్లి రామ్ గోపాల్, బోసు మన్మధరావు మాదిగ, డి గణేష్ ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ కృష్ణవేణి. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు జి సింహాచలం, బైరి కూర్మారావు, వామపక్ష నాయకులు తాండ్ర ప్రకాష్, టీ తిరుపతిరావు, మానవ హక్కుల వేదిక నాయకులు కేవీ జగన్నాథ రావు, బీసీ నాయకులు పి చంద్ర పెద్దారావు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోత ధర్మారావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి జీవి భూషణ్, సామ్నా నాయకులు ఎస్ నవ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: రూరల్ మండలం, వెంకటాపురానికి చెందిన కె.మౌనికకు అంగన్‌వాడీ కార్యకర్తగా నియామక పత్రాలను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంప్ కార్యాలయంలో అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంలో నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉంటూ,సామాన్యులకు సేవలందిస్తూ, గర్భిణులకూ, బాలింతలకూ అందించే పౌష్టికాహార పంపిణీని సరిగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ఐదేళ్ల లోపు పిల్లలలో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపట్టే అన్ని చర్యలూ క్షేత్ర స్థాయిలో సక్రమంగా అందేవిధంగా చూడాలని కోరారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గార ఐసీడీఎస్ ఆఫీసర్ రాధా మాధవి, ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బొబ్బాది చంద్రమౌళి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి పరామర్శ

విశాలాంధ్ర-గార: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న సిపిఐ శాఖ కార్యదర్శి లాపాటి అచ్చమ్మను సిపిఐ పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి పరామర్శించారు. గార మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన లాపాటి అచ్చెమ్మ అనారోగ్య సమస్యతో గత కొన్ని రోజులుగా సతమతమవుతుందన్న విషయం తెలుసుకొని శుక్రవారం నేరుగా ఆమెను పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వయస్సు పెరిగేకొద్దీ అనారోగ్య సమస్యలు పెరుగుతాయని, ఇటువంటప్పుడే జాగ్రత్తగా ఉండాలని ముందుకు సాగాలని భరోసా కల్పించారు. పార్టీకి ఎన్నో సేవలుచేసిన అచ్చెమ్మ ఆరోగ్యం కుదుటపడాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వీరితోపాటు లాపాటి అచ్చెమ్మ కుటుంబసభ్యులు పున్నమ్మ తదితరులున్నారు.

పంట కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలం యలమంచలి పంచాయతీ పరిధిలో గురువెళ్ళిపేట గ్రామ సమీపంలో రైల్వే లైన్‌కు సుమారు 100 అడుగుల దూరంలో పంట కాలవలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. ఈమె సుమారు 25-30 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి, నలుపు టాప్, నలుపు లెగ్గిన్ ధరించి తెలుపురంగు చాయ కలిగి ఉంది. ఈమె ఏదైనా రైలు నుంచి జారి పడిందా... లేదా ఎవరైనా హత్యచేసి పంటకాలువలో పడేసి ఉంటార అని అనుమానాలు సర్వాత్రా వ్యక్తం అవుతుంది. అయితే ఇంకా రైల్వే పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదని, ధర్యాప్తు చేస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మాణిక్యపురం ఫీడర్,ఆర్డబ్ల్యూఎస్ 11 కెవి ఫీడర్లో శనివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈ ఈ ఓ పలాస జి ప్రసాద్, ఇన్‌చార్జ్ ఏ ఈ నేతాజీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రోడ్ విడెనింగ్ లో ఉన్న పోల్స్ తొలగించడం గూర్చి విద్యుత్ నిలిపివేయబడునని తెలిపారు.కావున వరక,కుసుంపురం, బల్లిపుట్టుగ, మణిక్యపురం పంచాయతీ పరిదిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల పరిశీలన

తహసీల్దార్‌కు టీడీపీ వినతి

విశాలాంధ్ర - కాశీబుగ్గ : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు బూత్ లెవెల్ ఆఫీసర్‌తో బూత్ ఏజెంట్స్ తప్ప ఇతరులు వెళ్ళడానికి లేదని, కానీ వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం తలపించేలా బూత్ లెవెల్ ఆఫీసర్‌తో ఓటర్ల పరిశీలన నిర్వహిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధం అని తెలిసినా అధికారులు అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని టీడీపీ నాయకులు ఆరోపించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటిలో ఓటర్ల పరిశీలన నత్తనడక సాగుతుందని, సాధారణ విధులు నిర్వహించి ఎన్నికల విధులు చూడాలని మున్సిపల్ కమిషనర్ హుకుం జారీ చేయడంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారని పట్టణ అధ్యక్షుడు నాగరాజు ఆరోపించారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఓటరు వెరిఫికేషన్ విధులు సజావుగా సాగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, వజ్రపుకొత్తూరు టిడిపి అధ్యక్షుడు మోహనరావు ఉన్నారు.

జిల్లాలో రహదారులకు నిధులు మంజూరు చేయాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలోని రహదారుల సమగ్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడంతో పాటు నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రినీ కోరారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీ ని ఢిల్లీలో కలిసి పార్లమెంటరీ పరిధికి సంబంధించి 3 ప్రధాన అంశాలపై వినతిపత్రంలో అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలను జల, రోడ్డు, రైలు రవాణాకు అనుకూలంగా మలచేలా రహదారులను విస్తరించాలని కోరారు. దీనివల్ల జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలను పెంచవచ్చని తెలిపారు. ఇందులో భాగంగ చెన్నై-కోల్ కత్తా 16వ నంబర్ జాతీయ రహదారిలో 4 రాష్ట్రాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని గుర్తు చేశారు. సరుకు రవాణాలో ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ మార్గంలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా 4లైన్ల రోడ్లు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నరసన్నపేట-ఇచ్ఛాపురం మధ్య 100 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని 6లైన్లకు విస్తరించాలని ప్రతిపాదనలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఉన్న పలు రహదారులను అంతరాష్ట్ర రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని ఎంపీ విన్నవించారు. ఇందులో భాగంగా కళింగపట్నం - పార్వతీపురం వయా ఆమదాలవలస, పాలకొండ, వీరఘట్టం(సీఎస్ పీ) రోడ్డును ఒడిశాలోని రాయగడ వరకు విస్తరించాలన్నారు. అలికాం-బత్తిలి రోడ్డును వయా గార, ఆమదాలవలస, హిరమండలం, కొత్తూరు మార్గాన్ని ఒడిశా లోని గుణుపూర్ వరకు అనుసంధానించాలన్నారు. నౌపడ-నరసన్నపేట-మెళియాపుట్టి (డీపీఎన్) రహదారిని భావనపాడు పోర్టుకు కలుపుతూ పూండి, బెండిగేట్, సంతబొమ్మాలి, పోలాకి మీదుగా ఒడిశాలోని పర్లాకిమిడి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనితో పాటు జిల్లా పరిధిలోని 17 ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు, వ్యవసాయ పనులకు మార్గం కల్పిస్తూ 16వ నంబర్ జాతీయ రహదారిలో అండర్ పాసేజ్ లు, కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. టెక్కలి సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీల నుంచి భారీ వాహనాలు సులభంగా హైవే పైకి చేరుకునేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. కాగా దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీతో పాటు మాజీ ప్రభుత్వ విప్, శ్రీకాకుళం టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- ఐఏఎస్ సతీమణుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: గ్రీన్ ఎర్త్ ...గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ నినాదంతో ఐఏఎస్ ఆఫీసర్స్ (సతీమణులు) వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. శుక్రవారం స్థానిక కంపోస్ట్ కాలనీలో కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు వాటిని సంరక్షణ చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. నేడు వాహనాలు పెరగడం తో వాతావరణం విపరీతమైన కాలుష్యం బారిన పడడం చూస్తున్నామని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఇచ్ఛితంగా మొక్కలు నాటి వాటి పరిరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టి ఆహ్లాదకర వాతావరణంలోగల చక్కని గ్రీనరీని తీర్చిదిద్దుదామన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మన్నారు. వాతావరణ మార్పులు సవాళ్లు మరియు సహజ వనరుల పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇది ఒక ముఖ్యమైన సందర్భమని కలెక్టరు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఐఏఎస్ ఆఫీసర్స్ సతీమణులు, మహిళా అధికారులు, మహిళా వాలంటీర్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సతీమణి శైలి లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 16,420 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణం మెరుగు పడుతోందని, తద్వారా మన తరువాత రానున్న తరాలవారికి మంచి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క నాటి దానిని సంరక్షించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు కంపోస్ట్ కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ఆపేసిన రైల్వే అండర్ పాస్‌వే పనులు

పంటపొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న రైతులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... విశాఖపట్నం రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న గోవిందపురం (రెయ్యమ్మ బొడ్డపాడు) దగ్గర నిర్మాణం చేయటలపెట్టిన రైల్వే అండర్ పాస్‌వే పనులు, అర్ధాంతరంగా ఆపేశారని ఆగ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు ఏడాది క్రితం పనులు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో రైలు లైన్‌లు (రైల్వే ట్రాక్) క్రింద నుంచి నిర్మాణం పనులు కోసం తవ్విన స్థలాల్లో నీరు నిలువ ఉండిపోయిందని, దీంతో మా పంటపొలాలకు వెళ్లలేని దుస్థితి నెలకొందని వాపోయారు. ఇదిలా ఉండగా మా గ్రామానికి ఎదురుగా ఉన్న క్రాసింగ్ గేట్ ఎంతో కాలం నుంచి ఉన్నది బంద్ చేసారని తెలిపారు, దీంతో ఎంతోకాలంగా ఈగేటు ద్వారా తమ పంటపొలాలకు వెళ్లి వచ్చేవారమని, ఈ గేటు మూసివేయగా, నూతనంగా నిర్మించిన అండర్ పాస్‌వే నిర్మాణం మధ్యలో ఆపేసారని వారు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు చేస్తున్న సమయంలో సమయంలో, మా పంటపొలాల వెళ్లి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధించిన రైల్వే అధికారులు స్పందించి, మా పంటపొలాల్లో వ్యవసాయము పనులు చేసుకునేందుకు త్రోవ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనమే తాడివలస జడ్పీ స్కూల్

- తాడివలస ప్రభుత్వ పాఠశాలపై తప్పిన పెను ప్రమాదం
- భారీ వర్షాలకి స్లాబ్ నుండి బెంచీలపై పడిన పెచ్చులు
- శిథిల పాఠశాల భవనంలో విధులు

విశాలాంధ్ర-పొందూరు: సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనం గా నిలిచిన తాడివలస జిల్లా పరిషత్ ఉన్నతి పాఠశాల పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. నాలుగేళ్లలో అభివృద్ధికి నోచుకోలేని సర్కారు స్కూలు భయానక స్థితిలో కనిపిస్తుంది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 9వ తరగతి విద్యార్థులు కూర్చొన్న తరగతి గది యొక్క స్లాబు నుంచి పెచ్చులూడి బెంచీలపై పడ్డాయి. రాత్రి వేళలో పెద్ద సైజులో పెచ్చులూడి పడడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఎప్పుడో 1980లలో నిర్మించిన తరగతి గదులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో చాలా సార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరడమైనది. పలుమార్లు దినపత్రికల్లో కథనాలు రావడంతో గతేడాది జిల్లా స్థాయి ఇంజనీర్లు పాఠశాలకు వచ్చి ఈ తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చునుటకు అనుకూలంగా లేవని వీటిని తక్షణమే ఖాళీ చేయాల్సిన అవసరం ఉందని సెలవిచ్చారు. ప్రత్యమ్నాయంగా తరగతి గదులు నిర్మించకుండా, నూతనంగా నిర్మించిన తరగతి గదులు ప్రారంభించకుండా ఖాళీ చేయాలని చెప్పి చేతులు దులుపుకున్నారు. మరి విద్యార్థులకు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల్లో ఎక్కడ పాఠాలు బోధించాలో అర్థం కావడం లేదని గురువులు ఘోషిస్తున్నారు. ఈ పాఠశాలలో నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులు, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఉన్నారు. అయితే ఈ రోజుల్లో కూడా తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడడం చాలా బాధాకరం. విద్యార్థులు లేక వృధాగా తరగతి గదులు ఉన్న పాఠశాలలు ఒకవైపు అయితే, విద్యార్థులు ఉండి తరగతి గదులులేని మా తాడివలస ఉన్నత పాఠశాల మరోవైపుచూస్తే కురుస్తున్న భారీ వర్షాలకు తరగతి గదులు పూర్తిగా తడిసి పై స్లాబు నుంచి పెచ్చులూడి బెంచీలపై పడడంతో హెచ్ఎం గురువారం నాడే విద్యార్థులను ఖాళీ చేయించారు. దీంతో విద్యార్థులను కారుతూ ఉన్న రేకుల షెడ్లు లో కూర్చుండ పెట్టి తరగతి గదులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈపరిస్థితిలో ప్రధానోపాధ్యాయులు స్వయంగా క్లీనింగ్ స్టిక్ పట్టుకుని రేకుల షెడ్డు గదుల్లో చేరిన నీటిని శుభ్రం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు ప్రాంతలను పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ పర్యటించారు. శుక్రవారం దబ్బపాడు- తురకపేట మధ్య కనపలవానిగెడ్డ వద్ద ప్రజా రవాణా జరగకపోవడంతో, నీటి మునిగిన పంట పొలాలను పరిశీలించి విలేకర్లుతో మట్లాడారు. దబ్బపాడు-తురకపేట మధ్య కనపాలవాని గెడ్డపై బ్రిడ్జి పనులకు 2022లో 25 లక్షలతో మంజురు చేసి స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతమ్మ శంకుస్థాపన చేస్తే బ్రిడ్జి పనులకు ఇంతవరకు మొదలు పెట్టలేదని ఎమ్మెల్యే రెడ్డి శాంతమ్మ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. బ్రిడ్జి పనులు ప్రారంభం కాకపోవటానికి కారణం ఏంటి స్థానిక ఎమ్మెల్యే రెడ్డమ్మకి కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన కమిషన్లలో ఏమైనా తేడాలు వచ్చి పనులు ఆపేసార అని ప్రశ్నించారు.కనీసం సంబందిత అధికారులతో రివ్యు సమావేశం ఏర్పాటు చేసి తెలుసుకోవాల్సిన భాద్యత కూడా లేదన్నారు.నీటి మునిగిన వరి పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు.అలాగే దబ్బపాడు మీదుగా కొమనాపల్లి వెళ్లె ఆర్ & బి రహదారులపై ఉన్న యరగాం చాన్ని కల్వర్ట్ ఇటీవల కురిసిన వర్షాల వలన నీటి ప్రభావంతో కోతకు గురైనందువలన ఆయన పరిశీలించారు. ఎల్ఎన్‌పేట మేజర్ పంచాయితీ రోడ్లపై ఉన్న గుంతలను పరిశీలించారు. రోడ్ల గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండిపోవటం వలన గ్రామస్తులు అనారోగ్యంతో భారిన పడతారని వెంటనే గుంతలను పుడ్చాలని అధికారులను కోరారు. అలికాం-బత్తిలి రహదారి ప్రక్క నున్న కోవిలాంగ్రామ వద్ద రైతులు పంటలు నీటిలో మునిగిన పంటకు నష్టపరిహారం అందించాలన్నారు. తదితర గ్రామాలకు జలమయం అవటంతో రోడ్లులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా రైతు అధ్యక్షులు ఒమ్మి ఆనందరావు, శివ్వాల కిషోర్‌బాబు, మెండ మోహనరావు, కొమరాపు చిరంజీవి, మల్లేశ్వరరావు, జమ్మి మోహనరావు, నడిపల్లి నారాయణరావు, గుండపు రాము, ముద్దాడ చిట్టిబాబు, గణేష్, మెండ శ్రీనివాసరావు, దాలెప్పలనాయుడు, మోహనరావు, లక్ష్మీనారాయణ, వైశ్యరాజు రాజు, తంగి అప్పన్న, జోగినాయుడు, జగదీశ్, జోగారావు, కృష్ణ, రవి, హరి, రమేష్, ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరుగుతున్న దాడులను అరికట్టాలి

- మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి
- ప్రధాని మౌనం వీడి శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయాలి
- దళిత ఆదివాసీ మైనార్టీ ప్రజాసంఘాలు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : మణిపూర్‌లో కుకీ, నాగా తదితర ఆదివాసీలపైన, క్రైస్తవ చర్చిల పైన జరుగుతున్న దాడులను, స్త్రీల పై చేస్తున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మణిపూర్‌లో మారణకాండను అరికట్టాలనీ, క్రైస్తవుల చర్చిలపైన దాడులను నివారించాలనీ, స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగింపు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనీ, మోడీ-షా సర్కార్ మౌనం వీడి తమ అభిప్రాయాన్ని ప్రకటించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నల్లి ధర్మారావు, అట్టడా అప్పల నాయుడు, సన్నశెట్టి రాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు సామాజిక న్యాయ పోరాట సమితి, కల్లేపల్లి రాంగోపాల్ సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి గణేష్, కులనిర్మూలాన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, పిట్ట చంద్రపతిరావు, షానో, ఎజ్రా, కల్లేపల్లి రాంగోపాల్, పోతాల దుర్గారావు, శ్యాం, బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు, తాండ్ర ప్రకాష్, కృష్ణవేణి, నేతల అప్పారావు, బోసు మన్మధరావు, మ్యూజిబ్, జీలానిలు మాట్లాడుతూ తరతరాలుగా కలిసిమెలిసి జీవిస్తున్న మైతేయి, కుకీ, నాగాల మధ్య మత చిచ్చు రగిలించి, రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్న కేంద్రంలోని మోడీ-షా సర్కార్, రాష్ట్రంలోని బీరెన్ సర్కార్లు ప్రధాన దోషులని ఆరోపించారు. మైనారిటీలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దమనకాండల పై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ చేపట్టాలనీ, మహిళలను నగ్నంగా ఊరేగింపు జరిపి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ పర్వత ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను మోడి-షా సర్కార్ అంబానికి, ఆదానిలాంటి కార్పొరేట్ శక్తులకు అప్పగించాలనినే దురుద్దేశంతో చేస్తున్న దుర్మార్గ చర్యలను వారు తీవ్రంగా ఖండించారు. భారతదేశవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతున్నా, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ పరువుపోతున్నా, అనేక దేశాలు ఖండిస్తున్నా మోడీ-షా సర్కారు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. మణిపూర్ ప్రజలు చేస్తున్న ఉద్యమాలకు దళిత ఆదివాసీ ప్రజాసంఘాలు తరుపున పూర్తి సంఘీభావం తెలియజేశారు. మైతేయి తెగ ముసుగులో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ భజరంగ్ దళ్ సాగిస్తున్న మతోన్మాద దాడులను తీవ్రంగా ఖండించారు. మోడి-షాల ప్రభుత్వం వీటిని నివారించకపోతే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి, కృష్ణ, డీటీఫ్ ధర్మారావు, గురుమూర్తి, సందేశ్, బోనెల్ అప్పారావు ,భానుమూర్తి, ఇందిరప్రసాద్, విజికే మూర్తి, జి సింహచలం, తిరుపతిరావు, ప్రతాప్, రిషి, రత్నకుమారి, బొత్స బుద్ధుడు, రామప్పుడు, సాకేటి నాగరాజు, రమణమూర్తి, యాళ్ల జనకిరావు,బదే కమరాజు, రాయి వేణు, కొప్పుల డేనియల్, బాలకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 27లక్షల ఎకరాల భూమిపై రైతులకు పూర్తి హక్కులు కల్పించాం

రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాధరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 20 సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తున్న 27లక్షల ఎకరాల భూమి పై సంబంధిత రైతులకు పూర్తి హక్కులు కల్పించటం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాధరావు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన క్రిష్ణదాసులు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలో గల రేగులపాడు పంచాయతీ పరిధిలో సుమారు రూ. 80లక్షలతో నిర్మించిన సచివాలయ సముదాయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు ద్వారా ప్రజల వద్దకే పాలన వచ్చిందని, ఎప్పుడో వందేళ్ల కిందట జరిగిన సర్వే అప్ డేట్ కాకపోవడం వల్ల భూ రికార్డులు తప్పుల తడలకుగా మారాయని, దీనివల్ల రైతులు ఎల్లప్పుడూ సమస్యలు ఎదుర్కోవటాన్ని గమనించిన సీఎం జగన్మోహన రెడ్డి ఈ బృహత్ర యత్నాన్ని ప్రారంభించా రన్నారు. తాను రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు కార్య క్రమాన్ని ప్రారంభించడం ఎంతో గొప్ప గౌరవమని పేర్కొన్నారు. ఇప్పటికే సమగ్ర సర్వే చాలాచోట్ల పూర్తయిందని, రైతులకు భూహక్కు పత్రాలను కూడా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న ఈ సర్వే వల్ల భువివాదాలు పరిష్కారమౌతున్నా యన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనల ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ప్రతిపక్షాలకు పనిలేక జగనన్న కాలనీలో నీరు చేరింది, వాగులు పొంగుతున్నాయి అని విమర్శిస్తున్నారని వర్షాలు పడితే నీరు చేరదా... వాగులు పొంగవా.. రహదారులు బురదకాదా... అని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వ హయాంలో మీకు న్యాయం జరిగింది అని మీరు నమ్మితే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేయాలని, మళ్ళీ జన్మభూమి కమిటీలు కావాలంటే మీ ఇష్టమని కార్యక్రమానికి హాజరైన మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి అన్నారు. కరోనా సమయంలో పక్కఇంటికి వెళ్లాలంటే బయపడే రోజుల్లో వాలంటీర్లు మీ ఇంటికి వచ్చి రేషన్ అందించారని అలాంటి వారిపై అవగాహనలేని నాయకుడు మాట్లాడుతు న్నాడని మీరు ఏమి బాదపడాల్సిన అవసరం లేదని వాలంటీర్లకు అమె సూచించారు.

ఈ కార్య క్రమంలో టెక్కలి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జీ దువ్వాడ వాణి, ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాదాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామక్రిష్ణ, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్ రాజు, అన్నెపు రామారావు, గడ్డవలస నాగభూషణరావు, దుంగ శిమ్మన్న మాస్టర్, నూక సత్యరాజు, బమ్మిడి గణపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆశయ సాధనే లక్ష్యం

- 100 రోజుల పాటు నిర్విరామంగా అన్నాక్యాంటీన్ కొనసాగింపు
- టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య 100 రోజుల పండుగ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయసాధనే లక్ష్యంగా అన్నా క్యాంటీన్‌ను పునః ప్రారంభించామని టీడీపీ యువనాయకులు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని గొండు శంకర్ ఆధ్వర్యంలో అన్నాక్యాంటీన్‌ను ప్రారంభించి శుక్రవారం నాటికి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పేదల మధ్య కేక్ ను కట్ చేసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఉత్సవాలు జరుపుకున్నారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకులు దివంగత అన్న నందమూరి తారకరామారావు, దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ పేదల, అనాథల, కూలీల, కార్మికుల, చిరు ఉద్యోగుల ఆకలి తీర్చాలన్న సదుద్దేశ్యంతో నారా చంద్రబాబునాయుడు తాను అధికారంలో ఉండగా తన మానసపుత్రికగా అన్నాక్యాంటీను ప్రారంభించారన్నాను. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అన్నాక్యాంటీన్ ఎత్తివేసి పేదల, అనాథల, కూలీల, కార్మికుల, చిరు ఉద్యోగుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టెడన్నం కోసం పేదలు పడుతున్న కష్టం చూసి చంద్రబాబు ఆశయ సాధనే లక్ష్యంగా తాను నగరంలో మూడు చోట్ల తన సొంత నిధులతో అన్నాక్యాంటీన్ ప్రారంభించానని శంకర్ చెప్పారు. ఎండ, వాన దేనిని లెక్క చేయకుండా నేటికి 100 రోజులుగా అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నామని ఇది తమకెంతో ఆనందాన్ని సంతప్తిని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు నియోజకవర్గంలోని టీడీపీ నేతలంతా తమకు సహకరిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మరలా టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీని గెలిపించుకొని నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయడానికి తాము నిరంతరం సైనికుల్లా పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెళియాపుట్టి: అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల ఉన్నతికై సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో శుక్రవారం నాడు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో మహాత్మాగాంధీ కలలుగన్న సచివాలయ వ్యవస్థ ద్వారా రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలలో భాగస్వామ్యం చేయడం, సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఇంకా క్షేత్రస్థాయిలో ఏ చిన్న సమస్యనైనా ప్రభుత్వమే పరిష్కరించే దశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన రైతులకు రైతు భరోసా అందించడంతోపాటు కౌలు రైతులకు సైతం రైతు భరోస తదితర పథకాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుంద న్నారు. స్వర్గీయ రాజశేఖరరెడ్డి ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళ్లి వెళ్లే క్రమంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గత పాలకుల సమయంలో ప్రజా సమస్యలపై పట్టించుకునే పరిస్థితి లేదంటూనే ప్రస్తుతం దానికి భిన్నంగానే రాష్ట్రంలో పరిపాలన జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష ద్వారా ఏదైనా ఓ ధ్రువపత్రం కావాల్సి వస్తే 11 రకాలైన సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఇంకా అనేక అంశాలపై మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారి ధృపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం చాపర గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో సైతం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేతో పాటుగా జడ్పీటిసి సభ్యులు జి. ఎండయ్య, తహసిల్దార్ సరోజిని, ఎంపీడీవో చంద్రకుమారి, సర్పంచ్ లక్ష్మమ్మ, బోసి రామారావు, జైమినిరావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయధికారి దానకర్ణుడు, ఏపీఎం లలిత, ఈవోపీఆర్డి తారకేశ్వరి, వీఆర్వో, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గ్రామస్తులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బెహరా మనోవికాస కేంద్రంలో అల్పాహార విందు

- మనోవికాస కేంద్రానికి నిధులు సమకూరుస్తున్నాం
- జోగినాయుడు, వేణుగోపాల్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : స్థానిక కలెక్టర్ బంగ్లాదరిలో గల బెహరా మనోవికాస కేంద్రంలో పిల్లలకు జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్పాహార వితరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు శ్రీకాకుళం ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కొంక్యాన. వేణుగోపాల్, ఎలక్ట్రానిక్స్ మీడియా ప్రెసిడెంట్ శాశపు జోగినాయుడు, మెహర్ బాబా ప్రెసిడెంట్ గుడ్ల. సత్యనారాయణలు పాల్గొని మాట్లాడుతూ బెహరా మనోవికాస కేంద్రంలో సుమారు 70 మంది పిల్లల సంరక్షణ బాధ్యతలు చేపడుతున్న భాస్కర్, శ్యామల కుమారి, బెహరా శేఖర్, సేవలను వెలకట్టలేమని, వాళ్లకు అండగా ఉండాల్సిన అవసరముందన్నారు. శుక్రవారం జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి మేనల్లుడు అయాన్స్ జన్మదినం సందర్భంగా అల్పాహార విందు ఏర్పాటు చెయ్యటం హర్షణీయమని, డబ్బులు వృధా చెయ్యకుండా సేవలు చెయ్యటం మంచివిషయమన్నారు. ప్రతిఒక్కరు జిల్ ఫౌండేషన్ సేవలను విస్తృతం చేసి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా బెహరా వికాసకేంద్రానికి అవసరమైన నిధులను సమకూర్చటానికి తమవంతు సాయం ఉంటుంద న్నారు. ఈ సందర్భంగా మనో వికాసకేంద్రం ప్రవేశ మార్గానికి అవసరమైన టైల్స్ కోసం మెహర్ బాబా ప్రెసిడెంట్ గుడ్ల సత్యనారాయణ రూ. 25 వేలు, చేయూత మేమున్నాం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వైశ్యరాజు వెంకటలక్ష్మి రూ. 10 వేలు ప్రకటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మరిన్ని నిధులు సమకూర్చి త్వరలో కార్యరూపందాల్చే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెహరా మనోవికాస కేంద్ర సభ్యులు, జిల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య సాయి, జాడ చంద్రశేఖర్, శ్రీకాకుళం గ్రీన్ సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, మదర్స్ లవ్ ప్రెసిడెంట్ సుప్రజ రౌత్, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, లైన్స్ క్లబ్ సభ్యులు పొడుగు. చరణ్, జర్నలిస్ట్ పక్కి వేను, బాలు, ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి : ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : బట్టిగళ్లూరు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు నాణ్యమైన అంకితభావంతో కూడిన వైద్య సేవలు అందాలని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు వైద్యులకు సూచించారు. బట్టిగళ్లూరు పిహెచ్‌సిలో అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిని పరిశీలించి రోగులను కూడా పరిశీలించారు. వైద్యసేవలను గురించి రోగులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునాతనంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది రోగులకు సంతృప్తికరమైన సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికిరణ్, డాక్టర్ భవ్యసాయి, సర్పంచ్ బట్టి మాధవరావు, బైపల్లి కామేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్ మరమ్మతులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బోరుభద్ర గ్రామంలో త్రాగునీటి బోర్ ను సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో చేపట్టారు. గత కొంతకాలంగా బోర్ పాడవ్వటంతో తాగునీటికి ఇక్కడి ప్రజలు ఇబ్బందులుకు గురయ్యారు. దీంతో స్పందించిన సర్పంచ్ సంబంధించిన మెకానిక్ లను రప్పించి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బుసకల లక్ష్మయ్య ఉన్నారు.

ఖాదీ పరిశ్రమలోకి యువత రావాలి

విశాలాంధ్ర-పొందూరు : ఖాదీ బతికి బట్టకట్టాలంటే ఈ పరిశ్రమలోకి యువతరం ముందుకు రావాలని విశాఖ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం (వి.సి.సి.ఐ) అధ్యక్షురాలు ఈజివల్సురాగ్ అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక సన్న ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను సందర్శించారు. యువతీ, యువకులకు శిక్షణ నిప్పించేందుకు ఖాదీ గ్రామోద్యోగ కమిషన్ (కె.వి.ఐ.సి) చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఖాదీ వడుకు,నేతల ప్రక్రియలను పరిశీలించారు.గాంధీజీ కలలుగన్న ఖాదీ ప్రపంచం చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విశాఖ మహిళా వాకర్సు క్లబ్ పూర్వ అధ్యక్షురాలు దర్భా శిరీష, విశాఖపట్నం ఆరోహణ గిరిజన కార్యదర్శి సురేఖా పట్నాయక్, ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి.కె.ప్రసాద్, డి.వి.రమణ, వడుకు, నేత వృత్తి పనివారలు కోరుకొండ సరోజిని, మాడుగుల కళ్యాణి, మందుల హేమసుందరరావు తదితరులు మాట్లాడారు.

ప్లాస్టిక్ కవర్లతో మూగ జీవాలు మృతి

ప్రకృతి దినోత్సవంలో పశు వైద్యశాఖ ఏడి డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు

విశాలాంధ్ర-పలాస : రహదారులపై ప్రజలు ప్లాస్టిక్ కవర్లతో మిగులు ఆహార పదార్థాలతో పారవేసిన వాటిని మూగజీవులు తిని కడుపు నొప్పితో మృతి చెందుతున్నాయని పలాస పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖర రావు అన్నారు. శుక్రవారం ప్రకృతి దినోత్సవం సందర్భంగా గ్రీన్ ఆర్మీతో కలిసి పలాస ఏడి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి మొక్కలు గొప్పతనం వివరించారు.పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ. జంట పట్టనాల్లో ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్నారని వాటిని నిషేధించి ప్రజల్లో చైతన్యం తీసుకు రావదానికి గ్రీన్ ఆర్మీతో ర్యాలీలు చేస్తామన్నారు. గడిచిన వేసవిలో 40' డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరాయని మొక్కలు నాటి వాతావరణంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బోనెల గోపాల్, మాజీ కౌన్సిలర్ ఆర్ శాంతికుమారి, జాతీయ అవార్డు గ్రహీత అసపాన మధుబాబు, ఆర్టీఓ సహాయకులు దాసరి వైకుంఠరావు, మొక్కల ప్రేమికుడు కొత్తపల్లి చిన్నావారి, న్యాయ వాధి అంది రామకృష్ణ, పలాస యూత్ అసనియేషన్ అధ్యక్షుడు నక్క అనీల్ కుమార్, జెమ్స్ పిఆర్ఓ ఇచ్ఛాపురం ప్రదీప్ కుమార్, రొనంకి వెంకటరమణ, వైద్యులు డాక్టర్ మధు, కళ్యాణ్, ఆ శాఖ సిబ్బంది, గ్రీన్ కార్యదర్శి బందాపు తిరుమల తదితరులు పాల్గొన్నారు

కామ్రేడ్ చారుమజుందార్ 51వ వర్థంతి విజయవంతం

విశాలాంధ్ర-పలాస : సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారు మజుందార్ 51వ వర్థంతి సభ శుక్రవారం పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ మామిడి పల్లి గ్రామంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు, అసువులుబాసిన నాయకులకు, సహచరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంవత్సరం ఆరంభంలో పాట్నాలో పార్టీ 11వ మహాసభలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా మన ప్రస్థానం ప్రారంభించామని,ఆరోజున పార్టీ మహా సభ ఇచ్చిన "సేవ్ డెమోక్రసీ, సేవ్ ఇండియా" సింహనాదం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని అన్నారు. తీవ్రతరమవుతున్న సమస్యలపై దేశంలోని వివిధ ప్రాంతాలలో శక్తివంతమైన నిరసనలు పోరాటాలు చెలరేగుతున్నాయని మహాసభ నుండి ప్రారంభించిన ప్రతిపక్ష పార్టీల విశాల ఐక్యవేదిక నిర్మాణ ప్రక్రియ ఊపందుకుందని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు రెండు పర్యాయాలు సమావేశమైన తర్వాత, 'ఇండియా' (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్) బ్యానర్ క్రింద విశాల సంకీర్ణ వేదిక ఏర్పడిందని గుర్తు చేశారు. అనేక బీజేపీయేతర పార్టీలతో పాటు, మన పార్టీ ఈ సంకీర్ణంలో నిబద్ధత కలిగిన భాగస్వామిగా కొనసాగుతుంది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి మన ప్రయత్నాలను ముమ్మరం చేయాలని లిబరేషన్ జిల్లా నాయకులు కామ్రేడ్ మద్దిల రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కామ్రేడ్ వంకల అప్పయ్య, మహిళా నాయకులు కామ్రేడ్ కోనారి ఈశ్వరమ్మ, బ్రాంచ్ సెక్రటరీ జడ్డే జోగారావులు కామ్రేడ్ చారుమజుందార్ చిత్ర పటాన్ని పూలమాలలతో నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కామ్రేడ్స్ జడ్డే నేతాజీ, మద్దిల రాజారావు సార పాపయ్య, పున్నయ్య, తవిటయ్య,రామయ్య, మామిడి జానికి రావు,దేవరాజులు పాల్గొన్నారు.

రెండోరోజుకు చేరుకున్న విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

విశాలాంధ్ర-పలాస : తమ సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళన శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. వక్తలు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఒప్పంద కార్మిక కులకు పర్మినెంట్ చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. అనేక ఏళ్లుగా బకాయి ఉన్న ఏరియర్స్ విడుదల చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ ఇవ్వాలని, మరణించిన కొత్త జూనియర్ లైన్మెన్లు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కొత్త డివిజన్లోలో పూర్తిస్థాయి సిబ్బంది నియమించాలని, పెండింగ్ డీఏలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేసారు. సమానపనికి సమానవేతనం కల్పించాలని, మెడికల్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు పెట్టుకొని విధుల్లో పాల్గొని నిరసన వ్యక్తం చేస్తారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, డీఈఈ కృష్ణమూర్తి, ఏఏఓ భాస్కరరావు, లైన్ ఇనెఇన్స్పెక్టర్లు గార రాజారావు, కొమ్మల గిరేశ్వరరావు(గిరి), హిమగిరి, నీలాద్రితో పాటు డివిజన్కు చెందిన ఏఈఈలు, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్ మెన్లు, కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

భూమి భద్రంగా ఉండాలంటే పర్యావరణాన్ని పరిరక్షణ చేయాలి

విశాలాంధ్ర-పొందూరు: మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 75 మొక్కలను నాటే కార్యక్రమాన్ని నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల హెచ్ ఎం బల్ల కంటయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్నతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం బల్ల కంటయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ ధరిత్రిని భద్రంగా ఉంచాలంటే ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఈ తాడివలస ఉన్నత పాఠశాలను మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పరిచామని మరిన్ని మొక్కలు నాటి సంరక్షణ చేయడానికి విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర అటవీ శాఖ, ఉపాధి హామీ కూలీలు సహకారంతో ప్రతి ఏటా ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి విద్యార్థి తమ పుట్టిన రోజు సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 09.00గం.లకు ప్రారంభమవుతాయని అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మేరా మిట్టి మేరా దేశ్ ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటాలి, అలాగే ఒక పైలాన్ ఏర్పాటు చేయాలి అన్నారు. ప్రతి ఒక్కరు గ్రామంలో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించు కోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు సన్మానించుకో వాలని అలాగే పంచ ప్రాణ ప్రతిజ్ఞ, జండా వందనం చేయాలన్నారు. అందుకు సంబంధిత శాఖల అధికారులు కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంశా పత్రాలు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పేరేడ్ కార్యక్రమాన్ని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను ఇంజనీరింగ్ శాఖ, రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు తహాశీల్దార్ పర్యవేక్షిస్తారని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ, జిల్లా పౌర సరఫరాల అధికారి, గిరిజన సంక్షేమం, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వెలుగు, అటవీ శాఖ, కుటుంబ సంక్షేమం, డా.వై.యస్.ఆర్.ఆరోగ్యశ్రీ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, రహదారుల భద్రత, అగ్నిమాపక శాఖ మరియు, ద్వామా తదితర శాఖలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలను, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ యం.నవీన్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి.రాధికా, అటవీశాఖ అధికారిణి నిషాకుమారి, ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి మురళీ కృష్ణ, రెవిన్యూ డివిజనల్ అధికారి బొడ్డేపల్లి శాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డిఎస్ఓ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి. మీనాక్షి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వెంకట్ రామన్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు యం.గణపతిరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయి

సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు

విశాలాంధ్ర-కవిటి: ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయ ని సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమదాలవలస బదిలీపై వెళ్లిన బెలగాం సచివాలయ సిబ్బంది అయిన వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ అలాగే ఇద్దివానిపాలెం నుండి బదిలీ పై వచ్చిన వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి ప్రసాద్ కు సర్పంచ్ ప్రతినిధి ఎం.ఈశ్వరరావుతోపాటు సచివాలయ సిబ్బంది గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన రావు,మాజీ సర్పంచ్ నేతాజీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన గణిత దశావధానం

విశాలాంధ్ర-కవిటి : భారతీయ విద్యా కేంద్రంవారి కవిటి, జగతి, సిలగం బివికే పాఠశాలల వారు సంయుక్తంగా కవిటి బి.వి.కె పాఠశాల వద్ద గణిత దశావదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిలుగా కవిటి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి, గరవ అతిథిగా కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాఠశాల కరెస్పాండంట్ డాక్టర్ పూడి రామారావు, జగతి, సిలగాం, కే కొత్తూరు బి వి కే పాఠశాల ప్రధానాచార్యులు ఢిల్లేశ్వరావు, గణేష్, అనిల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గణితవధాని మద్దు తిరుపతి రావు గణిత అవధానం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఘన మూలాలు, సమస్య పూర్ణం, పంచమ మూలలు, మెమరీ గేమ్, గణిత చదరంపై విశదీకరించారు.అనంతరం కవిటి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి, గణితవధాని తిరుపతి రావు కు భారతీయ విద్యా కేంద్రం వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరంగి వెంకటరావు, బల్లెడ భారతి, బెందాలం రాంబాబు, కళ్యాణి జూనియర్ కళాశాల విద్యార్థులు, కే.కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భవితకు బాటలు వేసుకోవాలి

- మానసిక విషయ నిపుణులు... బొడ్డేపల్లి భూపతిరావు



విశాలాంధ్ర-పొందూరు: స్థానిక మానసవేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రముఖ మానసిక విషయ నిపుణులు బొడ్డేపల్లి భూపతిరావు 9, 10 తరగతి విద్యార్థులుకు ఉద్వేగాలను నియంత్రించు కుంటూ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవడమెలా అనే విషయం పై అత్యద్భుతమైన సూచనలు చేశారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ఉన్నతమైన వ్యక్తులు యొక్క జీవిత చరిత్రలు చదివి, ప్రేరణ పొందాలని చెప్పారు. లక్ష్యం స్పష్టంగా ఉండాలని, గమ్యం చేరేవరకు అలుపెరుగని కృషి ఇష్టంగా సాగించాలని, అప్పుడే విద్యార్థి దేశానికీ పనికి వచ్చే శక్తిగా మారతాడని చెప్పారు. విద్యార్థులకు పలు ఆసక్తికరమైన అంశాలును సోదాహరణంగా వివరిస్తూ స్పందన ఇదా ఫౌండేషన్‌కు నేను సైతం అనే కార్యక్రమంలో భాగంగా ఈరోజు మానసవేణి ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రేరణాత్మక ప్రసంగం ద్వారా ఆకట్టుకున్న భూపతిరావుని అభినందించారు.

వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సీఎం జగన్ సమీక్ష

- వర్షాలు, వరద బాధితులకు ఉదారంగా సహాయం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఆదేశాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి మానవతా దృక్పథంతో ఉదారంగా సహాయం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కలెక్టర్ లకు, అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు వరదల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై సి.ఎం. శుక్రవారం జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి.లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి మంచి ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని వసతులను కల్పించాలని కోరారు. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే వారికి ఒక్కో కుటుంబానికి రూ.2000 నగదు సహాయం అందించాలని సూచించారు. పూరి గుడిసెలు దెబ్బతిన్నప్పుడు ఆయా కుటుంబాలకు పూర్తి స్థాయి సహాయంగా రూ.10 వేలు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలపై దృష్టి సారించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్,



ఎస్.పి. జి. రాధిక, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి మురళీ కృష్ణ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దువ్వాడ వాణి

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం జరిగిందని టెక్కలి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ దువ్వాడ వాణి అన్నారు. మండలం వాంద్రాడ సచివాలయం వద్ద ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులతో కలిసి ఇన్‌చార్జ్ ఎంపీడీవో తులా రాజారావు ఆద్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు ఫ్యామిలీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ళలో అనేక పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు అందని వారు ఉంటే గుర్తించి వారికి కూడా అందించటం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరో సారి వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెలమల శాంతారావు, ఎంపీటీసీ మెండ తాతయ్య, వ్యవసాయ కమిటి సభ్యులు కవిటి రామరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎండలకే పరిమితమైన రైల్వే అండర్ పాస్‌లు

- వర్షాకాలంలో ప్రాణంతకం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రైల్వే ట్రాక్ పొడువునా కోటబొమ్మాళి మండల పరిధిలో నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లు ఎండకాలనికే పరిమితమవుతున్నాయి. గత నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అండర్ పాస్ వంతెనలు నీటితో నిండి పోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగి ప్రాణాంతకంగా

మారుతున్నాయి. వంతెనలు నిండి నీరు బయటకు వెళ్ళే అవకాశం లేక ప్రజలు రాకపోకలకే కాకుండా ప్రస్తుతం దమ్ముల సీజన్ కావడంతో ట్రాక్టర్లు, పశువులు అండర్‌పాస్‌నుంచి వెళ్ళలేక అనేక చోట్ల రైతులకు దమ్ముకు, ఉబాలకు అనుకూలంగా ఉన్నప్పటికి పనులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి మండల పరిధిలో తిలారు, పంతులపేట, వింజాంపాడు, నూకపేట తదితర గ్రామాలు వద్ద ఈ పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు తప్పనిసరి పరిస్థితులలో మోటార్లుపెట్టినీరును బయటకు తోడుకోవాల్సిన పరిస్థితి ఉంది. మరికొన్ని చోట్ల అయితే గ్రామ పెద్దలు రైల్వే కాంట్రాక్ట్ దృష్టికి తీసుకు వెళ్ళాగా వారు నీటిని ఇంజన్‌లతో తోడిస్తున్నా. వంతెన కిందకు పెద్ద ఎత్తున బురద చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధప్రాతి పదికన ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అవగాహన సదస్సును విజయవంతం చేయ్యండి

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: ఈనెల 30వ తేదీన టెక్కలి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సమతాసైనిక్‌దళ్ ఆద్వర్యంలో జరగనున్న భారతరాజ్యాంగంపై అవగాహన సదస్సుకు జిల్లాలోని దళిత, గిరిజన, బహుజనలందరు పెద్ద ఎత్తున హజరు కావాలని సమతాసైనిక్‌దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు శుక్రవారం పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన అక్కయ్యవలస, జీయన్నపేట, కురుడు, కిష్టుపురం తదితర గ్రామాల్లో దళిత వాడలను సందర్శించి కార్యక్రమానికి హజరై విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఈ సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్, సమతాసైనిక్ దళ్ రాష్ట్ర అద్యక్షులు పాలేటి మహేశ్వరరావు, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పల్లి సురేంద్రబాబు, క్రమశిక్షణా సంఘం చైర్మన్ గొల్ల వరప్రసాద్, అశోక్ అంబేద్కర్‌లు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని దళిత, గిరిజన, బహుజనలందరు, అంబేద్కర్ అభిమానులు ఎక్కువ సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈయనతో పాటు పిలక చంటి, పేర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జగరకుండా అవగాహన

విశాలాంధ్ర-కవిటి/కంచిలి : మండలంలో నెయ్యిల గణేష్(17) బెహేరా ఈనెల 17వ తేదీన కరరజ్వాల దగ్గర ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా మరణించారు. అయితే మరణించడానికి ప్రధాన కారణం చిన్న చిన్న నిర్లక్ష్యాలు హెల్మెట్ లేకపోవడం వలన తలకి బలంగా గాయాలు కావడంతో ఆ సంఘటన జరిగిందని, సందర్భంగా శుక్రవారం యువకులను, తల్లిదండ్రులను ప్రజలను చైతన్య పరిచే అవగాహన కార్యక్రమాన్ని శాసనం గ్రామంలో అయినింటి లోకనాధం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్(ఎంఎస్ జనరల్ సర్జన్), కంచిలి పోలీస్ రైటర్ సుశీల్ కుమార్, గ్రామ సర్పంచ్ వేణు, రైల్వే ఉద్యోగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా..?

- జీడి సమస్య పై మంత్రి ఎందుకు మాట్లాడటం లేదు
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ
- కాశీబుగ్గలో సత్యాగ్రహం దీక్ష

విశాలాంధ్ర-పలాస: జీడి సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, పండించిన పంట అమ్ముడు పోవడం లేదని , జీడికి మద్దతు ధర కల్పించాలని ఉద్యమం చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఏపీ జీడి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 24 గంటల పాటు సత్యాగ్రహం దీక్షను మాజీ ఎమ్మెల్సీ శర్మ ప్రారంభించారు. ఏపీ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శర్మ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు జీడి రైతుల ఆకలి కేకలు వినపడడం లేదా అని ప్రశ్నించారు. వాస్తవానికి జీడి రైతుల సమస్యల పై మంత్రి దీక్ష శిబిరాన్ని ప్రారంభించాలి కానీ ఆ దమ్ము ధైర్యం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వద్దకు వెళ్ళేందుకు ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలకు అవకాశమే లేదని, సిఎం కోసం పడిగాపులు కాస్తున్నారని, వీరా ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తారా అని ఎద్దేవా చేశారు. జీడి రైతుల సమస్య పై టిడిపి, జనసేన పార్టీ నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విదేశాల నుంచి పిక్కలు దిగుమతి చేయవద్దని కేంద్రానికి చెప్పే ధైర్యం వైసిపి, టిడిపి నేతలకు ఉందా అని ప్రశ్నించారు. వ్యవసాయం దెబ్బతీసే విధానాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం వల్లే జీడి పంటకు గుర్తింపు లేకుండా పోయిందని, వీటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి 16 వేల గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఆర్.బి.కె.ల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

జీడి పిక్కలు ధర పాతాలంకు పోతుంటే జీడిపప్పు ధర ఆకాశాన్ని తాకుతున్నదని దీనికి ప్రభుత్వం కారణం కాదా అని ప్రశ్నించారు. 2019లో 80 కేజీలు జీడి పిక్కలబస్తా రూ.14 వేలు ధర పలికితే నేడు రూ. 8 వేలకు పడిపోయిందని, దీంతో రైతాంగం తీవ్రంగా దోపిడీ గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బిజెపి, రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం జీడి పిక్కల మద్దతు ధర పై ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారే తప్ప ఆచరణకు నోచుకోలేదన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే స్థానిక మంత్రి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కోసం ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. జీడి రైతుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. గత 125 రోజులుగా జీడి రైతులు గిట్టుబాటు ధర కావాలని ఆందోళన చేస్తుంటే ఈ జిల్లాలో ఉండే మంత్రులు గాని స్పీకరు గాని పట్టదా అని ప్రశ్నించారు. కేరళ తరహాలో జీడి బోర్డు గాని, కార్పొరేషన్ గాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక జీడి పిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ జీడిపిక్కల దిగుమతికి అనుమతించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని జీడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. మోహన్ రావు మాట్లాడుతూ జీడి రైతులు ఒంటరిగా లేరని పోరాటానికి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలు మద్దతుగా ఉన్నారన్నారు. సత్యాగ్రహ దీక్షలో కె మోహన్ రావు, అంబటి రామకృష్ణ, కొర్ల హేమారావు చౌదరి, తవిటయ్య, పోతనపల్లి కుసుమ, గున్నయ్య, కె బాలాజీ రావు, కె సింహాచలం, ఎస్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులు కె. హేమ సూధన రావు, కె. బాలాజీ రావు ఆటపాటతో పలువురిని కట్టుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వర రావు రూ. 2 వేలు, ఇతర రైతులు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీక్షకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, మందస సిఐటియు నాయకులు దిలీప్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, క్యాష్యూ లేబర్ యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి కోనేరు భీమారావు,బొమ్మాళి తాతయ్య, క్యాష్యూ లేబర్ అసోయేషన్ కార్యదర్శి అంబటి ఆనందరావు, ఎస్‌యఫ్ఐ నాయకులు హరీష్, చందు, వంకులూరు యంపిటిసి కొండప్ప సురేఖ, శాతుపల్లి కాంతారావు, దాసరి శ్రీరాములు, వంకల మాధవరావు,తామడ త్రిలోచన, కె హైమావతి, జె భాగ్యలక్ష్మి, యన్ దిల్లేస్వరి, మద్దిలి రామారావు, తమ్మినాన భాస్కరరావు,బాగాధి, వాసు,ఆర్ దిలీప్ కుమార్, మట్ట ధర్మారావు, సంగారు లక్ష్మీనారాయణ, అండమాన్ ప్రజా పోరాట నాయకులు దుమ్ము లక్ష్మణరావు, కర్రి పాపారావు సంఘీభావం తెలిపారు.

రాకపోకలకు ఇబ్బంది

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగి చెరువులు తలపిస్తున్నాయి ముద్దాడ పంచాయతీ అంబేద్కర్ నగర్ నుంచి కొయ్యవానిపేట వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు మధ్యలో ఉన్న కల్వరి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఇక్కడ ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు ముద్దాడ పరిధిలో 150 ఎకరాలు, 75 ఎకరాలు, ధర్మవరంలో 75 ఎకరాలు, సుమారుగా 300 ఎకరాల వరి నాటు నీట మునిగాయి.

అర్హులకు పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం

విశాలాంధ్ర-జలుమూరు: జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు ధర్మాన కృష్ణ దాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమమని, ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటే వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందించడానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలియజేశారు. అనంతరం జగనన్న సురక్ష సర్టిఫికెట్ లు కృష్ణదాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈయనతోపాటు ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సర్పంచ్ బూరెలా ఆశీరమ్మ, మొజ్జాడ శ్యామలరావు, మొజ్జాడ భాస్కర్ రావు, కనుసు సీతారామ్, పొన్నాడ విజయ్, పైడి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నడగాం కాలువకు గండి

విశాలాంధ్ర-జలుమూరు : మండలం కూర్మనాథపురం గ్రామం సమీపంలో వంశధార సాగునీటి కాలువకు గండి పడిందని స్థానిక రైతులు శుక్రవారం తెలియజేశారు. నాల్గైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలో నీటి ప్రవాహం పెరగడంతో 3అర్ నడగాం వంశధార కాలువకు గండి పడిందని రైతులు తెలిపారు. గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గండిని పరిశీలించి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని వంశధార జేఈ తెలిపారు.

సరవేగంగా ఫిర్యాదులు లేకుండా ఇంటింటి సర్వే చేయాలి

విశాలాంధ్ర-పొందూరు : ఓట్ల పరిశీలన కోసం ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు బిఎల్వో లు చేపడుతున్న ఇంటింటి సర్వేపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా బిఎల్వోలదే బాధ్యతని ఎంపీడీవో సీపాన హరిహరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. పారదర్శకంగా నిర్వహించాలని సర్వేలో లొసుగులు జరిగనట్లు ఏ పార్టీ నుంచి పిర్యాదు వచ్చినా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కింతలి. కనిమెట్ట మొదలవలను తదితర గ్రామాలలో సచివాలయాలను ఆరు స్మైక తనిఖీ నిర్వహించి సచివాలయానికి ఆలస్యంగా వచ్చిన సిబ్బందిని తీవ్రంగా మందలించారు.

విద్యతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

విశాలాంధ్ర-రణస్థలం: ప్రతీ విద్యార్థికి విద్యతో పాటు క్రమశిక్షణ చాలా అవసరమని ఆర్ జె డి విశాఖపట్నం ఎం. జ్యోతికుమారి అన్నారు. శుక్రవారం మండలం లో గల లంకపేట కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆలోచన చేసి ప్రైవేట్ పాఠశాలలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తుందని వాటిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకొనే విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మధ్యాన్నం భోజనం మెనూ పరిశీలించారు. ఉపాధ్యయులతో మాట్లాడుతూ విద్యార్థిలకు విద్యతో పాటు ఆటలు పాటలు వ్యాయాయం తదితర వాటిపట్ల ఆసక్తి కలిగించాలన్నారు. అనంతరం మండల కేంద్రం లోగల మండల విద్యావనరుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆనంతరం మాట్లాడుతూ సిఆర్‌పిలను మీ యొక్క విద్యార్హతలను బట్టి మీకు సిఆర్‌ఎంటిలుగా ప్రభుత్వం అవకాశం కల్పించిందని మీరంతా సిఆర్‌ఎంటి విధులతో పాటు సిఆర్‌పి విధులు కుడా నిర్వహించవలసి ఉంటుందన్నారు. మీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్ టీచర్ పాఠశాలలలో ఉపాధ్యయులు సెలవు పై వెళ్ళినపుడు ఆయా పాఠశాలలకు మీరు వెళ్ళినపుడు విద్యా ప్రమాణాలు అభివృద్ధికి కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె తో పాటు మండల విద్యాశాఖాధికారి ఎ. త్రినాథరావు, సిఆర్‌పిలు, ఆర్. పాపినాయుడు, జె.శ్రీనివాస్, వై. యోగానంద్, ఎస్. రామకృష్ణ, జి. రామకృష్ణ, జైలక్ష్మి, జి. గౌరినాయుడు, ఎం ఐ ఎస్ పి.విజయకుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఐ.ధనుంజయ్, అకౌంటెంట్, రామారావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

కాంటాక్ట్ కార్మికుల హక్కులు కాపాడాలి

సిఐటియు ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-ఆమదాలవలస: రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధిని కాపాడాలని కార్మికులకు కనీసం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. జూల్కై- 28న రైల్వే కార్మికుల ఆల్ ఇండియా డిమాం డ్స్ డే సందర్భంగా రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని,రైల్వే కార్మికులకు కనీస వేతనం లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో కార్మికుల వేతనాలు అందిం చాలని, ఈపీఎఫ్ పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మహిళా కార్మికులపై లైంగిక వేధింపు చర్యలను అరకట్టాలని, మహిళా కార్మకులపై దుర్భాషలు, లైంగిక వేధింపులు, బెదిరింపులను నిర్మూలించాలి అన్నారు. జీతంతో కూడిన వారాంతపు శెలవులు మంజూరు చెయ్యాలని, ద.మ. రైల్వే ఈ. కో రైల్వేలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య కుదించాలని ఉద్యోగాల నుండి తొలగించాలని రైల్వేవారు ఇచ్చిన ఆర్డర్స్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వి ఆదినారాయణ జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దన్ రావు రిటైర్డ్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ పూర్వ కార్యదర్శి బెండి. సూర్యనారాయణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి టి సంతోష్ కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి. తిరుపతిరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో మంచి జరుగుతుందనే విశ్వాసం ఉండాలి

- వచ్చే నెలాఖరులోగా 129 భవనాలు పూర్తి
- డిసెంబరులోగా 79 భవనాలు పూర్తిచేయాలి
- జిల్లా ఇన్ చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

- విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మంచి జరుగుతుందనే విశ్వాసం కలిగేలా పనిచేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పాతపట్నం నియోజక వర్గ స్థాయి సమీక్షా సమావేశం జిల్లా పరిషత్ మందిరంలో మంత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వారం ఒక నియోజక వర్గ స్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా గత రెండు వారాల క్రితం ఆమదాలవలస నియోజక వర్గంపై సమీక్షించామని, తదుపరి పలాస చేయాల్సి ఉండగా అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు తెలిపారు. ఈ సమీక్షల వలన ఆ నియోజక వర్గంలోని సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించు కునేందుకు ఇదొక చక్కని వేదికని స్పష్టం చేశారు. తొలుత పంచాయతీ రాజ్ శాఖను సమీక్షిస్తూ పాతపట్నం నియోజక వర్గ పరిధిలోని ఐదు మండలాల్లో జరుగుతున్న 208 ప్రాధాన్యత భవనాలకు గాను129 భవనాలు తుది దశలో ఉన్నందున ఆగస్టు నెలాఖరు నాటికి అవన్నీ పూర్తికావాలని ఆదేశించారు. మిగిలిన 79 భవనాలు ఈ ఏడాది చివరినాటికి పూర్తికావాలని అన్నారు. ఇప్పటివరకు పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, మెళియాపుట్టి మండలాల్లో తుది దాసలోనున్న 61 సచివాలయాలు, 48 రైతు భరోసా కేంద్రాలు, 20 వై.ఎస్.ఆర్.హెల్త్ క్లినిక్స్ భవనాలను వచ్చే నెలాఖరులోగా పూర్తిచేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని అన్నారు. ఇప్పటివరకు చేపట్టిన భవనాలకు పూర్తి చెల్లింపులు జరిగాయని, మిగిలిన భవనాలకు కూడా సిమెంటు, ఇసుక, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. అందువలన గుత్తేదారులు తమకు అప్పగించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. కొత్తూరు మండలంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయాల నిర్మాణాలకు చెందిన బిల్లులు నేటికి ఏడాది అయినప్పటికీ చెల్లించలేదని మంత్రి దృష్టికి గుత్తేదారు తీసుకురాగా, దీనిపై పరిశీలన చేసి చెల్లింపులు జరిగేలా చూడాలని జెసిని ఆదేశించారు. పాతపట్నం శాసనసభ్యులు రెడ్డి శాంతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నవరత్నాల్లో భాగంగా పేదలందరికి ఇళ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అయితే గృహ నిర్మాణాల్లో తమ నియోజక వర్గం వెనుకంజలో ఉందన్నారు. ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖ పిఎంఎవై గ్రామీన్ క్రింద 3,163 గృహాలు మంజూరుచేసారని చెప్పారు. వీటితో పాటు మరో 3,600 స్వంత స్థలాలు కలిగిన వారు ఉన్నారని, వారు కూడా గృహ నిర్మాణాలు చేపట్టుకునేలా తగు ఆదేశాలు జారీచేయాలని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, ఈ సమావేశానికి శాసనమండలి సభ్యులు నర్తు రామారావు, మాజీ ఉపముఖ్యమంత్రి,నరసన్నపేట శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ జయరాం కృష్ణ, గృహ నిర్మాణ శాఖ పథక సంచాలకులు ఎన్.గణపతి, వ్యవసాయ శాఖ, పశు సంవర్దక శాఖ,జిల్లా నీటియాజమాన్య సంస్థల సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, డా.ఎం.కిషోర్, జి.వి.చిట్టి రాజు,సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త డా. ఆర్.జయప్రకాష్,జిల్లా సరఫరాధికారి డి.వి.రమణ, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.లక్ష్మి ప్రసన్న,పాతపట్నం నియోజకవర్గం లోని వివిధ శాఖల మండల అధికారులు, జెడ్.పి.టి.సిలు, ఎం.పి.పిలు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అమానుష హింసను నిరసించండి

- స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో సభ అండ్ నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మణిపూర్ లో జరుగుతున్న అమానుష హింస, అత్యాచారాలు అలజడులను తక్షణమే ఆపించి దోషులను తీవ్రంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ మణిపూర్ లో గిరిజనుల నరమేధం జరుగుతోందని, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు జరుగుతున్న దారుణ హింసను అదుపు చేయడంలో గిరిజనుల హక్కులు కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యాయని, పేర్కొన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కామ్రేడ్ వర్మ మాట్లాడుతూ మణిపూర్ లో ఈ హింసను ఆపలేకపోయిన సిగ్గులేని కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న ప్రధానమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ లోని గిరిజన ప్రాంతాలలోని అపారమైన సహజ వనరులను, అమూల్యమైన కనీస సంపదను కొల్లగొట్టడానికి - గిరిజనేతరులకు , కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకే ఈ అమానుష హింసను పెంచి పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే గిరిజన మహిళల మానప్రాణాలకు , ప్రాథమిక హక్కులకు - రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షులు తాండ్ర అరుణ మాట్లాడుతూ మణిపూర్ లో మహిళలపై జరిగిన అనాగరికమైన చర్యను స్త్రీ విముక్తి సంఘటనగా నిరసిస్తున్నామని, ఇటువంటి హింసలు జరిగి మూడు నాలుగు మాసాలు కావస్తున్నా నేరస్తులపై చర్యలు శూన్యమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నైతికతను కోల్పోయాయని పేర్కొన్నారు. మణిపూర్ లో బాలలు , మహిళలు , గిరిజనుల పక్షంగా సంఘీభావాన్ని తెలియజేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. జనసాహితి జిల్లా కార్యదర్శి పి. మోహనరావు మాట్లాడుతూ మణిపూర్‌లో గత నాలుగు నెలలుగా జరుగుతున్న మారణకాండను, నేపథ్యాన్ని, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. మణిపూర్ లో జరుగుతున్న సంఘటనలు ఉపేక్షించదగినవి కావని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు మణిపూర్ లో బాధితులపక్షంగా సంఘీభావంగా కవిత చదివి వినిపించారు. సమావేశంలో మహిళలు ఉపాధ్యాయులు ప్రగతిశీల వాదులు, రచయితలు, కళాకారులు సుమారు వందమంది పాల్గొన్నారు. సభలో పాల్గొన్న అందరూ కూడా పొట్టి శ్రీరాములు జంక్షన్ లో మానవహారంగా ఏర్పడి, సాధారణ ప్రజానీకానికి మణిపూర్ లో జరిగిన అమానుష దమన కాండ, మహిళలపై జరుగుతున్న నిరంతర లైంగిక దాడులు భారతదేశం సిగ్గుపడేటట్లు జరుగుతున్నాయని - ముక్తకంఠంతో నినదించి, తెలియపరుస్తూ, ఆ దుర్ఘటనల పట్ల బలంగా నిరసనను తెలిపారు.